నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | మార్చి 25, 2024 | www.navatelangana.com

బరంపూర్‌లో గ్రంథాలయం ప్రారంభం

నవతెలంగాణ-తలమడుగు



బరంపూర్ గ్రామంలో గ్రామస్తులతో పాటు ఉద్యోగ సంఘం నాయకులతో కలిసి ఆదివారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రామంలోని యువత పదవి వీరమణ పొందిన ఉద్యోగులు, నిరుద్యో గులు గ్రూప్ పరీక్షలు రాసేవారికి అన్ని రకాల పుస్తకాలను ఏర్పాటు చేయనున్నట్టు గ్రామస్తులు తెలిపారు. కనీసం రోజుకు ఒక గంట సైనా గ్రంథాలయానికి వచ్చి పేపర్‌తో పాటు జ్ఞానాన్ని సంపాదించే పుస్తకాలను చదవాలన్నారు. కార్యక్రమంలో మేకల మురళీధర్, ముజిబుల్ రహమాన్, కేదారీశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మాడూరి రమకాంత్, లక్ష్మణ్, నారాయణరెడ్డి, విజయ్‌కుమార్, నగేష్, నర్సిములు, హరికాంత్, ప్రశాంత్ గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంట్లో హోలీ వేడుకలు

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలో ఉన్న బోథ్ ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం అభిమానులు, కార్యకర్తలు, నాయకులు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కూడా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపి సీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో నీటి గోస..!

- పల్లెల్లో పడకేసిన మిషన్ భగీరథ పథకం
- పైప్‌లైన్ల లీకేజీలు..మరమ్మతులు లేక అస్తవ్యస్తం
- అనేక గ్రామాల్లో వారం..పది రోజులకు ఒకసారి సరఫరా
- దాహం తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్న ప్రజలు
- పరిశీలించని ప్రత్యేక అధికారులు..పర్యవేక్షణ మరిచిన ఉన్నతాధికారులు


తాండ్రలో మరమ్మతులకు గురైన చేతి పంపు

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. దాహం తీర్చుకునేందుకు అనేక గిరిజన పల్లెలు ఆపసోపాలు పడాల్సి వస్తోంది. ఇంటింటికి శుద్ధజలం అందించేందుకు రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ పథకం అనేక చోట్ల అలంకార ప్రాయంగా మారింది. ట్యాంకులు నిర్మించి..పైప్‌లైన్లు వేసి..నల్లాలు బిగించినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ప్రతి వేసవి మాదిరిగానే ఈ యేడూ తాగునీటి సమస్య తప్పేలా కనిపించడం లేదు. తాగునీటి సమస్య రానీయొద్దని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కారణంగా జనం గొంతు తడుపుకొనేందుకు సైతం అవస్థలు పడాల్సి వస్తోంది. పల్లెలకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాల్సిన ప్రత్యేక అధికారులు అటువైపు ముఖం చూపడం లేదు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు సైతం దృష్టిసారించకపోవడంతో ఏజెన్సీ పరిధిలోని అనేక పల్లెలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మోతిపటార్‌లో కనెక్షన్ ఇవ్వని ట్యాంకు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, జైనూర్, ఉట్నూర్



ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం తాండ్ర పంచాయతీ ప్రజల పరిస్థితి ఇది. ఈ గ్రామంలో నెల రోజుల నుంచి భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ఇతర రోజుల్లో పది రోజులకు ఒకసారి సరఫరా అవుతోంది. ఇటీవల అధికారులు ఆ గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా సుమారు 450మీటర్ల లోతు వరకు ఒక బోరు వేశారు. కానీ నీరు రాలేదు. దీంతో సమీప గ్రామం ఓల్‌వాడీకి ఎడ్లబండ్లు, ఆటోలు తీసుకెళ్లి అక్కడి చేతిపంపు నుంచి నీటిని తీసుకొస్తూ దాహం తీర్చుకుంటున్నారు. తాజాగా గ్రామంలోని నల్లా వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపి వారి బాధను తెలియజేశారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి కటకట నెలకొంది. భగీరథ పథకం వచ్చిన తర్వాత ఈ సమస్య పరిష్కారమవుతుందని భావించినా ఇంకా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కనిపిస్తోంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంకులు..పైప్‌లైన్లు, ఇంటింటికి నల్లాలు బిగించినా ఫలితం కనిపించడం లేదు. విద్యుత్ సమస్యల కారణంగా సంపుల నుంచి ట్యాంకులకు నీటిని ఎక్కించడం సమస్యగా మారుతుండగా..అక్కడి నుంచి ఇంటింటికి సరఫరాలోనూ లోపాలు తలెత్తుతున్నాయి. పైప్‌లైన్లు తరుచూ లీకేజీలు కావడం.. వాటి మరమ్మతులను స్థానిక అధికారులు మర్చిపోవడం మూలంగా అనేక పల్లెలు రోజువారీగా గొంతు తడుపుకొనేందుకు ఇబ్బందులు పడాల్సివస్తోంది. ముఖ్యంగా ఎండల తీవ్రత కారణంగా భూగర్భజలాలు సైతం అడుగంటిపోవడంతో వాగులు, బావులు ఎండిపోయాయి. స్థానిక నీటి వనరులైన చెలిమెలు..ఊటల్లోనూ నీరు రావడం లేదు. దీంతో గతంలో వేసిన చేతిపంపులనే ఇప్పటికీ నమ్ముకుంటున్నారు. ఎక్కడో ఊరు చివరన..వ్యవసాయ పొలాల వద్ద ఉండే బోరుబావుల వద్దకు వెళ్లి కాలినడకన, ఎడ్లబండ్ల ద్వారా నీటిని తెచ్చుకొని తాగుతున్నారు. వాటినే అన్ని అవసరాలకు వినియోగిస్తున్నారు.

అనేక మండలాల్లో సమస్య..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 70 మండలాలు ఉండగా సుమారు 45 మండలాల వరకు ఏజెన్సీ ప్రాంతంలోనే ఉన్నాయి. కొండలు, గుట్టల మధ్య అనేక మారుమూల ప్రాంతాలు ఉండగా..దాదాపు అన్ని గ్రామాల్లో భగీరథ ట్యాంకులు నిర్మించారు. గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్లు వేయడంతో పాటు ఇంటింటికి నల్లాలు సైతం బిగించారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనూర్, కెరమెరి, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్ రూరల్, తలమడుగు, గాదిగూడ, నార్నూర్, సిరికొండ తదితర మండలాలతో పాటు మరికొన్నింటిలోనూ తరుచూ నీటి సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతోంది. కొన్ని గ్రామాల్లో రోజువారీగా సరఫరా కాగా.. మరికొన్ని పల్లెల్లో వారానికి ఒకసారి జరుగుతోంది. ముఖ్యంగా అనేక చోట్ల పైప్‌లైన్లు లీకేజీలు కావడం, సంపుల వద్ద సాంకేతిక సమస్యల కారణంగా సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన చేసి వాటికి మరమ్మతులు చేయించాల్సి ఉన్నా అటు వైపు దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. పల్లెల్లో నీటి సమస్య పరిష్కారానికి 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవడంతో పాటు నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పర్యవేక్షణ మరిచిన అధికారులు..!

ఉమ్మడి జిల్లాలోని అనేక మారుమూల పల్లెల్లో సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచ్‌ల పాలన ముగిసిపోవడంతో ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కానీ అనేక మంది అధికారులు వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లడం లేదని తెలుస్తోంది. కొన్ని పల్లెలకు ప్రత్యేక అధికారులు ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉంది. ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడం.. ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయకపోవడం మూలంగా పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నట్లు తెలుస్తోంది.



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం మోతీపటార్ గ్రామంలోని పరిస్థితి ఇది. సుమారు 120 నివాసాలు..730మంది జనాభా కలిగిన ఈ గ్రామంలో ఇక్కడ మిషన్ భగీరథ నీరు వారానికి ఒకరోజు సరఫరా అవుతోంది. ఊరి చివరన రెండు చేతిపంపులు ఉండగా ఇందులో ఒకటి పనిచేయడం లేదు. మరోక చేతిపంపు వద్దకు ఎడ్లబండ్లతో నీటి డబ్బాలు తీసుకొని వెళ్లి గంటల తరబడి అక్కడ నిరీక్షించి నీటిని తీసుకొస్తూ దాహం తీర్చుకుంటున్నారు. నూతనంగా ట్యాంకు నిర్మించినా కనెక్షన్ ఇవ్వలేదు. ఈ సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. మరోపక్క జైనూర్ మండల కేంద్రంలోని బాలాజీనగర్‌లో ఇప్పటి వరకు పైప్‌లైన్లు వేయలేదు.

ఉన్నతాధికారులు దృష్టిసారించాలి

\- జాదవ్ న్యాను, మోతిపటార్



మా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. రోజువారీగా తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ సమస్యను అధికారులకు ఇది వరకే చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలి.

తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది

\- చంద్రశేఖర్, తాండ్ర, ఉట్నూర్ మండలం



మా గ్రామంలో సుమారు నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. నీటి ట్యాంకు వినియోగం లేదు. గ్రామస్తులకు తెలియకుండానే అధికారులు ఓ బోరు వేశారు. కానీ నీళ్లు రాలేదు. దీంతో గ్రామస్తులు సమీప గ్రామానికి వెళ్లి చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్య పరిష్కరించాలి.

వివాహానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-నార్నూర్

ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం జాదవ్ కౌసల్య బాయి గత ఐదు నెలల కింద అనారోగ్యంతో మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో కూతురు పెండ్లి దగ్గర పడటంతో ఖర్చుల నిమిత్తం గ్రామానికి చెందిన సంత్ సేవాలాల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించి, మానవత్వం చాటుకున్నారు. గ్రామస్తులు పలువురు వారిని అభినందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఉద్యోగసంఘాల నాయకులు చౌహాన్ కిషోర్, జాదవ్ పరశురాం, చౌహాన్ పునిరాం, జాదవ్ ఆనంద్‌రావ్, రాథోడ్ గణేష్, రాథోడ్ తానాజి, దినేష్, సంతోష్, బాపురావ్, అశ్విన్, రామేశ్వర్, గోకుల్, దిలీప్, రోహిదాస్ ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దిలావార్‌పూర్



మద్యానికి బానిసై, అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం... బెళారం నరేష్(36) బ్రతుకుదెరువుకు డ్రైవరుగా పని చేసేవాడు. కొన్ని సంవత్సరాలుగా అతను మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రూ.3లక్షల అప్పు చేశాడు. గత కొన్ని రోజులుగా ఎటువంటి పని చేయకుండా మద్యానికి బానిసై చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన అతను శనివారం అర్ధరాత్రి తన ఇంట్లోని బెడ్ రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేద మహిళ వివాహానికి ఎన్ఆర్ఐ సాయం



నవతెలంగాణ-ఖానాపూర్ టౌన్

డబ్బులు లేక ఇబ్బంధి పడుతున్న పేద మహిళ పెండ్లి కోసం ఓ ఎన్ఆర్ఐ అండగా నిలిచి ఆర్థిక సాయం చేశాడు. మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల లక్ష్మిని తన భర్త వదిలేయడంతో అదే గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. తన కూతురు రిషికకు ఇటీవల పెండ్లి సంబంధం కుదిరింది. డబ్బులు లేక ఇబ్బంది పడుతూ తన కూతురు వివాహం ఎలా చేయాలని మదన పడుతున్న లక్ష్మి దీన స్థితిని ఇజ్రాయిల్ దేశంలో ఉన్న ఖానాపూర్ పట్టణానికి చెందిన గొల్ల వత్తుల రాజేశ్వర్‌కు మిత్రుల ద్వారా సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న గొల్లవత్తుల రాజేశ్వర్ నిరుపేద అయిన లక్ష్మి కూతురు రిషిక పెండ్లికోసం రూ.50వేల నగదుగా పంపించారు. సదరు డబ్బులను ఆదివారం ఆయన మిత్రులు రవిచరణ్, గాండ్ల నర్సయ్య మహేష్, శేఖర్, నరేష్, నాగరాజు కలిసి లక్ష్మికి అందజేశారు. ఎన్ఆర్ఐ ఔదర్యాన్ని గ్రామస్తులు అభినందించారు.

పిడమర్తి రవికి ఎంపీ టికెట్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వరంగల్ ఎంపీ స్థానాన్ని లేదా కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవికి కేటాయించాలని మాదిగ జేఏసీ ఆదిలాబాద్ అధ్యక్షులు మనోజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డిలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంతో పాటు మాదిగ ఉపకులాల అభివృద్ధికి సేవలు అందిస్తున్న పిడమర్తి రవికి ఎంపీ లేదా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని పేర్కొన్నారు.

రేపు క్లబ్ ఫుట్ ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లోని డైస్ కేంద్రంలో ఉమ్మడి జిల్లాలోని క్లబ్‌ఫుట్ బాధిత చిన్నారులకు ఈనెల 26న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డా.రాథోడ్ నరేందర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, ఆర్బీఎస్‌కే సమన్వయకర్త శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో 18 సంవత్సరాలలోపు బాధిత చిన్నారులకు చికిత్సలు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

లంబాడాలకే ఎంపీ టికెట్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఉట్నూర్



జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా లంబాడా గిరిజనులకు ప్రకటించాలని ఉమ్మడి ఆదిలాబాద్ లంబాడా జేఏసీ నాయకులు గోపాల్‌రావు, జగన్, పవన్, సురేష్, గోవర్ధన్‌లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శత్రు నాయక్ ఫంక్షన్ హాల్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అధికార పార్టీలో మా లంబాడా కులం నుంచి ప్రాతనిధ్యం వహించే ఎమ్మెల్యే ఎంపీలు జిల్లాలో ఎవరూ లేరని, లంబాడా సామాజిక వర్గానికి ఆదిలాబాద్ పార్లమెంట్ సీటు కేటాయించాలని కోరారు. తెలంగాణ ప్రాంతంలోని లంబాడాలకు రిజర్వేషన్ కల్పించింది కాంగ్రెస్ అని అన్నారు. తెలంగాణలోని లంబాడా గిరిజనులు, ఎప్పుడు కాంగ్రెస్ పార్టీకి విధేయులుగానే ఉన్నారని అన్నారు. జిల్లాలో లంబాడాలు ఆందోళనకరమైన పరిస్థితుల్లో ఉన్నారని, వారిలో మనోధైర్యం నింపడానికి, ఆత్మ విశ్వాసం పెంచడానికి, భయాందోళన పరిస్థితుల నుంచి దూరం చేయడానికి జిల్లా నుంచి పార్లమెంటుకు లంబాడి గిరిజనులకు పంపవలసిన అవసరం, ఆవశ్యకత ఉందని సమావేశంలో పేర్కొన్నారు. మా ఆందోళనకర పరిస్థితులను జాతీయ కాంగ్రెస్ పార్టీ అర్థం చేసుకుంటుందని లంబాడా గిరిజన అభ్యర్థికి ఆదిలాబాద్ పార్లమెంటు సీటు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని వారు పేర్కొన్నారు. ఒకవేళ జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు సీటును లంబాడా గిరిజనులకు కేటాయించకుంటే, భవిష్యత్తు కార్యచరణ త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో లంబాడా జేఏసీ ఉమ్మడి జిల్లా నాయకులు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా నాయకులు, సేవాలాల్ సేన జిల్లా నాయకులు, బంజారా యువసేన జిల్లా నాయకులు, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, లంబాడా ఐక్యవేదిక జిల్లా నాయకులు. ఈ సమావేశంలో లంబాడా గిరిజన జేఏసీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా సలహాదారులు జాదవ్ గోపాలరావు, జాదవ్ రాంకిషన్ నాయక్, గూగ్లోత్ రవి నాయక్, రాథోడ్ శంకర్ నాయక్, ఆడే సురేష్, రాథోడ్ బలిరామ్, పవార్ రవీందర్ నాయక్, జాదవ్ ధనరాజ్ నాయక్, సూరాజి, బానోతు జగన్, జాదవ్ బలరాం నాయక్, జేపీ నాయక్, రాథోడ్ మహేందర్, సునీల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా రజక సంఘం కార్యవర్గం ఎన్నికలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రజక సంక్షేమ సంఘం పట్టణ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగాయి. ఆదివారం పట్టణంలోని రజక సంఘ భవనంలో ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాలెట్ విధానంలో ఈ ఎన్నికలు జరుగగా కుల బంధువులు, సంఘం సభ్యులు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచే ఈ ప్రక్రియ మొదలైంది. పట్టణ అధ్యక్ష పదవీ కోసం కొండూరి స్వామి, చెక్కల్‌వార్ సోమేష్, ముల్కల్‌వార్ సంతోష్, మునిగంటి సంతోష్, ప్రధాన కార్యదర్శి పదవీ కోసం గంగసరపు సంతోష్, ముస్కు వినోద్ పోటీ పడ్డారు. వీరికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించి సజావుగా ఎన్నికలను నిర్వహించారు. దీంతో సంఘ భవనం వద్ద కోలాహలం నెలకొంది. పట్టణ పూర్తి కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమక్షంలో ఎన్నుకోనున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి రెండు సంవత్సరాల కాల పరిమితి ఉంటుందని అడహక్ కమిటీ సభ్యులు తెలిపారు.

వికాస్ స్మారకార్థం క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-జైనథ్

తమ మిత్రులు స్వర్గీయ వికాస్ స్మారకార్థం రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్రికెట్ పోటీలను ఆదివారం లక్ష్మీపూర్ గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్గీయ వికాస్ స్నేహితులు మాట్లాడుతూ వికాస్ స్వర్గీయులైనప్పటికి వారి జ్ఞాపకాలు తమ హృదయాల్లో ఎప్పటికి పదిలంగా ఉంటాయని అన్నారు. వికాస్ వారితో ఉన్న క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఈ క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.3వేల నివాల్ వికాంత్, రెండో బహుమతిగా రూ.2వేలను బోయర్ దేవిదాస్ అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపూర్ మహార్ సంఘం ఉపాధ్యక్షులు బద్రే సుభాష్, యూత్ నాయకులు ప్రభాకర్, యోగేందర్, హెడవ్ అశోక్, అనిల్, భీంరావ్, సాయి, కలాల అశోక్, సురేందర్ పాల్గొన్నారు.

ఘనంగా కామదహనం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ప్రతి ఆదివాసీ పల్లెల్లో ఘనంగా కామదహన వేడుకలు సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఎంత దూరంలో ఉన్నా హోలీ పండుగకు తమ ఊరుకు విచ్చేసి సంబరాలు జరుపుకుంటారు. ఆదివాసులు ఈ హోలీ పండుగకు తమ పచ్చని అడవి దేవతకు తమ సాంప్రదాయాలతో ఆచార వ్యవహారాలు పాటిస్తూ, ఉదయం నుంచే గ్రామాల్లో పండుగ వాతావరణం ఏర్పడుతుంది. యువకులంతా కలిసి గ్రామం నుంచి అడవికి వెళ్లి వన దేవతకు పూజలు నిర్వహించి, రెండు వెదురు బొంగులను తెచ్చి వాటిని గ్రామపటేల్ ఇంట్లో ఉంచుతారు. అనంతరం ప్రతి కుటుంబం నుంచి కుడుకలు, చక్కెర హారాలు జమచేసి వాటిని వెదురు భోంగులకు కట్టి ఊరి పొలిమేరలో దహనం కొరకు డోలు వాయిస్తూ తీసుకొని వెళ్తారు. వెదురు బొంగులకు మాతరి మాత్రల్ అని గొండి భాషలో పిలుస్తారు. వాటికి గారెలు, ఉల్లిపాయలు, వంకాయలు, ఇతర నవధాన్యాలతో తయారుచేసిన వాటితో అలంకరణ చేసి వెదురు బొంగులకు కడతారు. ఇలా ఆదివాసుల సాంప్రదాయం. పొలిమేరలో రెండు వెదురు బొంగులను ఏర్పాటు చేసి కామదహనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్, దేవరీ, ప్రజలు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | మార్చి 25, 2024 | www.navatelangana.com

ముధోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ముథోల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ముథోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ముథోల్ మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్ ఆదివారం బైంసాలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ముథోల్‌ను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాల్సిందిగా




ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. 12 వేలమందికి పైగా ఓటర్లు, 25 వేల మందికి పైగా జనాభా ఉన్న ముథోల్ నగరపంచాయతీకి పట్టణానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే ముథోల్‌లో నిలిచిపోయిన నూతన ఆస్పత్రి భవనం నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు.

హోలీ కామదహనం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మాన్కాపూర్, తాడిహత్నూర్ గ్రామాలతో పాటు ఆయా ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గ్రామపొలిమేరలో ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ఆదివారం ప్రజలు హోలి కామదహనం పూజలు చేశారు. ఈ సందర్భంగా మంటలో కుడుకలు చక్కెర బిళ్లలు నైవేద్యం అర్పించి పూజలు చేసి హోలీ కామదహన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాన్కాపూర్ పటేల్, మెస్రం రూపదేవ్, ఏఎంసీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, కొట్నాక్ పవన్ కుమార్, మోతీరాం, చందు, సీతారామ్, సోము, రమేష్, నాగోరావ్, రూపదేవ్, తాడిహత్నూర్ మాజీ సర్పంచ్ మధుకర్ రాథోడ్, ఉపసర్పంచ్ విష్ణు, రాథోడ్ గణేష్, కోటగిరి విశాల్, పటేల్ రాథోడ్ దినేష్, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత పది సంవత్సరాలుగా విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, నూతన ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షులు సునీల్ చవాన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతీ ఆశ్రమ పాఠశాలకు రెగ్యులర్ వార్డెన్, ఏఎన్ఎంని నియమించాలని కోరారు. ఈ సమావేశం అనంతరం తపస్ ఆదిలాబాద్ రూరల్ మండల ఇన్‌చార్జి కుర్సింగ డిజాబాయి ఆధ్వర్యంలో నూతన మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుంటుకు వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా స్వర్గం రవి కుమార్, ఆర్థిక కార్యదర్శిగా రాథోడ్ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా జాదవ్ రాంజీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు గోపికృష్ణ, నాయకులు బత్తుల గంగాధర్, తులసీరాం, స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి చేయని మోడీ సర్కార్‌ను సాగనంపాలి

- మంత్రి సీతక్క



నవతెలంగాణ-భైంసా

కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎక్కడ అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని కేంద్రంలో మోడీ సర్కార్‌ను సాగనంపే సమయం ఆసన్నమైందని మంత్రి సీతక్క అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా ఆదివారం భైంసాలోని గౌరీ శంకర్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఆమె సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవుళ్ళ, మతం పేరుతో ప్రధాని మోడీ, ఆ పార్టీ లీడర్లు రాజకీయాలు చేయడమే కాకుండా ఇప్పుడు ఓట్లు అడిగేందుకు వస్తున్నారన్నారు. అప్పట్లో బీజేపీ దేశంలోని ప్రతీ పేదోడి ఖాతాలో రూ. 15లక్షలు జమ చేస్తాననీ చెప్పి, కనీసం రూ.10వేలు కూడా వేయలేదన్నారు. కనీసం 10వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఇచ్చిన 5 గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసి చూపించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమూచిత స్థానం కల్పించి అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రజల కష్టాలు కన్నీళ్లు తుడిచేందుకే అధికారంలోకి వచ్చిన, కొద్ది రోజుల్లో 30వేల ఉద్యోగాలు భర్తీ చేశామని పేర్కొన్నారు. చిన్న చిన్న పొరపాట్లతో కరెంటు పోయినా, బీఆర్ఎస్ లీడర్లు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హమీలకు కట్టుబడి ఉండి, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ.6లక్షల కోట్లు అప్పులు ఉన్న వడ్డీలు కడుతూ అభివృద్ధి చేసేందుకు ముందుకు పోతున్నామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సమాచార హక్కు చట్టం తీసుకవస్తే, ఇప్పుడున్న బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నారాయణ్‌రావు పటేల్‌లు నియోజవర్గంలోని పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హమిచ్చారు. అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మంత్రి సితక్క సమక్షంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో జిల్లా ఇన్‌చార్జ్ సత్తు మల్లేష్, నాయకులు ఆనందరావు పటేల్, ఓంప్రకాశ్ లడ్డ, బాశెట్టి రాజన్న, బుచ్చన్నతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే కమ్యూనిటీ పోలీసింగ్



నవతెలంగాణ-నార్నూర్

ప్రజల భద్రతకే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని చోర్‌గావ్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో సీఐ రహీం పాషా, ఎస్సై రవికిరణ్ గ్రామస్తులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి సైబర్ క్రైమ్, గంజాయి వినియోగం, క్రయవిక్రయాలు వాటి దుష్పరిణామాలు, స్త్రీలపై జరిగే నేరాలు, డయల్ 100, మద్యపానం వినియోగం అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో రోడ్లపై చోర్‌గావ్ గ్రామాన్ని మద్యపానం, గంజాయి రహిత గ్రామంగా తీర్మానం చేయాలనే ఉద్దేశంతో గ్రామంలోని యువత గ్రామస్తులతో కలిసి పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా చట్ట వ్యతిరేక పనులకు ఎవరు పాల్పడవద్దని చట్ట ప్రకారం శిక్షింపబడతారని, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలందరూ చట్టానికి లోబడి ఉండాలని సూచించారు.

రాష్ట్ర విజయ డెయిరీ మాజీ చైర్మెన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తలమడుగు

విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి 70వ జన్మదిన వేడుకలను ఆదివారం రుయ్యాడిలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయనను పలువురు శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 69 సంవత్సరాలు ముగించుకొని, 70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రజల ఆశీర్వాదాలతో ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. ప్రజలు కూడా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. జన్మదిన వేడుకల్లో మండల మాజీ ఎంపీపీ బిట్ల పెద్ద గంగన్న, మాజీ సర్పంచ్ పోతారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగాధర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేదారీశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు ప్రకాష్‌రెడ్డి, నిట్టడి గంగాధర్, కరోబారి సంజీవరెడ్డి, మోతె శ్రీనివాస్, గోక భూమారెడ్డి, నర్సింగ్, అశోక్, విష్ణువర్ధన్‌రెడ్డి, బంధువులు, స్నేహితులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అలేఖ్య కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తాం

- అలేఖ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ-ఖానాపూర్

అలేఖ్య కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం ఖానాపూర్ పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న అలేఖ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అలేఖ్య హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హంతకుడు చేసిన విచక్షణ రహిత దాడిలో తీవ్రంగా గాయపడిన మరో యువతీ, జయశీల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అలేఖ్య హత్య కేసులో నిందితులు శ్రీకాంత్ సహ మరో ఇద్దరిని కఠినంగా శిక్షించాలంటే కచ్చితంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. జయశీల ఆరోగ్య పరిస్థితిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆమెకు భవిష్యత్తులో న్యాయం జరిగేలా తన వంతుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. హత్య జరిగిన తీరు, అలేఖ్య



కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య, ప్రొఫెసర్ కోదండరాం వివరించారు.

ఆయన వెంట మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు భుజంగరావు, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు విజయకుమార్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు తిలక్‌రావు ఉన్నారు.

లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.2లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ-తలమడుగు

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మండలంలోని లక్ష్మీపూర్ అంతర్‌రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించగా రూ.2 లక్షల పట్టుబడినట్టు రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఫణీంద్ర తెలిపారు. మహారాష్ట్ర నాందేడ్ వైపు నుంచి ఎంహెచ్ 26 సీఈ 7458 అను నెంబర్ గల కారులో ఎలాంటి అనుమతులు ఆధారాలు లేకుండా వాహనంలో తరలిస్తుండగా తనిఖీల్లో భాగంగా పట్టుబడినట్లు తెలిపారు. ముక్తార్ జాగిర్ధార్ నాందేడ్ వద్ద నుంచి రూ.2లక్షల స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. రూ.2లక్షలను కలెక్టరేట్‌లోని ప్రత్యేక కౌంటర్‌లో జమ చేయనున్నట్టు తెలిపారు. ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు ఎవరైనా రూ.50 వేల మించకుండా తీసుకెళ్ల కూడదన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై ధనశ్రీ, ఏఎస్సై సురేందర్, ఎస్ఎస్‌టీం మాణిక్ ప్రభు, దత్తు, పోలీస్ సిబ్బంది శేషరావు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఉట్నూర్ సీఐ మొగిలి పరిశీలించారు. 006/28 పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌పై విధిగా నెంబరును వేయాలన్నారు. ఉట్నూర్ డివిజన్ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్నటు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్, పంచాయతీ సిబ్బంది ఇద్రిస్ ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

నవతెలంగాణ-ముథోల్

బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఆదివారం సాయంత్రం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క దర్శించుకున్నారు. ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేష్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కదిలి పాపహరేశ్వరునికి మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని సుప్రసిద్ధ కదిలి శ్రీమాతన్నపూర్ణ, పాపహరేశ్వర ఆలయంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. పూజల అనంతరం పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాశస్త్యం గురించి స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, అత్రం సుగుణ, ఆత్రం భాస్కర్ ఉన్నారు.

పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



నార్నూర్



ఖానాపూర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ప్రజలందరూ పండుగను ప్రశాంత వాతావరణంలో సంస్కృతి, సాంప్రదాయాల నడుమ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీసు వ్యవస్థ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు ప్రకటించారు. ముఖ్యంగా యువత మద్యం తాగి వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. జిల్లా ప్రజలు సురక్షితమైన రంగులను వాడి పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. యువత హోలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి అని సూచించారు. ముఖ్యంగా యువత తల్లిదండ్రులు పిల్లల కార్యక్రమాలను గమనిస్తూ వారికి సరైన పద్ధతినీ తెలియజేయాలని సూచించారు. వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, లాంటి కార్యక్రమాలను యువత మానుకోవాలని సూచించారు.

నార్నూర్ : అన్ని పండుగల్లో ప్రత్యేకమైనది హోలీ పండుగ. ఈ పండుగను జిల్లాలోని గిరిజనులు విభిన్నంగా జరుపుకుంటారు. తమతమ ఆచారాల అనుగుణంగా నిర్వహిస్తారు. యేండ్ల కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని నేటికీ పాటిస్తూ తమకు తామే సాటి అని నిరూపించుకుంటున్నారు. హోలీ పండగ సందర్భంగా ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఆదివాసీ సంస్కృతి ప్రకారం హోలీ పండగ రోజు గ్రామ పటేల్‌కు గ్రామంలో అందరూ కుడుకలు ఇస్తారు. ఇలా కుడుకలు ఇచ్చిన వారే గ్రామస్తులుగా పరిగణిస్తారు. ఆ గ్రామంలో ఉండికూడా కుడుకలు ఇవ్వకుంటే గ్రామంలో ఆ కుటుంబానికి సంబంధం లేదని గుర్తిస్తారు. ఈ ఆచారం చాలా కాలం నుంచి వస్తుందని ఆదివాసులు పేర్కొంటున్నారు.

జిల్లాలో గిరిజనులు సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్ద పీట వేస్తారు. హోలిని అన్ని పండుగల కన్న భిన్నంగా నిర్వహిస్తారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ తొడసం నాగోరావ్, ఆదివాసులు జరిపే పండుగల్లో హోలీ దురాడి పండుగలు భిన్నంగా ఉంటాయని అన్నారు. అంతా ఒకటై కాముడి పున్నమిని జరుపుకుంటాం. కుడుకల ఆచారం చాలా ముఖ్యం. కుడుకలు గ్రామ పటేల్‌కు అందిస్తేనే వారు ఆ గ్రామంలో ఉన్నట్లు లేకుంటే లేనట్టే కాముడి దహనం తరువాత అందరం రాత్రంతా అక్కడే బస చేయడం ఆనవాయితీ. నవధాన్యాలు ప్రతి ఇంటి నుంచి సేకరించి, వడ్డించి ఉదయాన్నే పొలంలో వెళ్లి పూజలు చేసి భోజనం చేస్తారు. అనంతరం రంగులు వేసి దురాడి ఆడుకుంటారు.

ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని ఆయా కాలనీల్లో చిన్నారులు హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు సైతం ఈ హోలీ పండుగలో పాలుపంచుకున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా హోలీ పండుగ సందర్భంగా రంగుల బండిని ఏర్పాటు చేసి, ప్రధాన రహదారుల గుండా హోలీ ఆడుతూ నృత్యాలు చేస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం, వైస్ చైర్మెన్ కావలి సంతోష్, కౌన్సిలర్స్ నాయకులు కుర్మా శ్రీనివాస్, కిషోర్ నాయక్, నాయకులు నాయిని సంతోష్, కోఆప్షన్ సభ్యులు బండారి కిషోర్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంత్రరాజ్యం సురేష్, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని పులిమడుగు గ్రామంలో ఆదివారం హోలీ పండుగ సందర్భంగా యువత ఒకరికొకరు రంగులు చల్లు కుంటూ, ఆటపాటలతో హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ హోలీ సంబరాల్లో ఉట్నూర్ సోషల్ మీడియా నాయకులు బాబా శ్యామ్ చవాన్ పాల్గొని, ప్రజలకు, యువతకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి అనువాయితీగా వస్తున్న హిందూ సంప్రదాయం ప్రకారం ప్రజలు కలిసికట్టుగా, శాంతియుతంగా పండుగలను జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువతి యువకులు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.



ఉట్నూర్

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం

నవతెలంగాణ-వాంకిడి



మండలకేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం డాక్టర్ వినయ్ ఉప్రె మాట్లాడుతూ మూడు వారాలకు మించి దగ్గు, రాత్రి సమయంలో జ్వరం, బరువు తగ్గడం లక్షణాలు ఉంటే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ క్షయ వ్యాధి నిర్ధారణ అయితే మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రోగులకు నెలనెల రూ.500 ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, ఏఎన్ఎంలు కృపవాణి, రుక్మిణి, సునంద, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ సేవా సమితి సభ్యుల ఔదార్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని రెండు కుటుంబాలకు భారతీయ సేవా సమితి సభ్యులు ఆర్థిక సహాయం అందించి ఔదార్యం చాటారు. స్థానిక నౌగాంబస్తీకి చెందిన క్యాన్సర్ బాధితుడు మహ్మద్ ఫోర కుటుంబానికి రూ. 10 వేలు, మేదరి బస్తీకి చెందిన నిరుపేద యువతి వివాహ ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు అందించి ఉదరత చాటారు. సేవ కార్యక్రమాల్లో ముందుకు సాగుతున్న సమితిని పలువురు అభినందించారు. ఈ కార్యమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

టీచర్లకు చెక్‌పవర్..!

- ఎస్ఎంసీల స్థానంలో బాధ్యతలు
- బిల్లుల చెల్లింపులకు మరింత వెసులుబాటు
- తాజాగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నవతెలంగాణ-జైనూర్



ప్రభుత్వ పాఠశాలల్లో నిధుల వినియోగానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతేడాది డిసెంబర్ నెలలో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లను ప్రభుత్వం రద్దు చేసింది. అంతకు ముందు ఎస్ఎంసీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పేరుమీద జాయింట్ చెకపవర్‌తో నిధులు డ్రా చేసేవారు. కానీ కమిటీల రద్దు తర్వాత కొత్త ఎస్ఎంసీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెక్ పవర్ సమస్య ఏర్పడింది. దీంతో మూడు నెలలుగా పాఠశాల నిర్వహణ నిధులు వినియోగించలేని పరిస్థితి నెలకొన్నది. ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం ఎస్ఎంసీ చైర్మెన్ల స్థానంలో హెచ్ఎంతో పాటు పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయుడికి జాయింట్ చెక్‌పవర్ కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఎస్ఎంసీ ఖాతాల్లోని నిధులను వినియోగించుకోవడానికి అవకాశం కలిగింది.

720 పాఠశాలలు..

కుమురం ఆసిఫాబాద్ జిల్లాలో 720ప్రాథమిక, ప్రాథమికోన్నత కలిపి మొత్తం 720 పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు ఎమ్మార్సీ పాఠశాలలు 15, కేజీబీవీ 15, యూఆర్ఎస్ 1 చొప్పున ఉన్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఏటా వివిధ గ్రాంట్ల కింద రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు నిధులను విడుదల చేస్తున్నది. ఈ నిధులను ఏడాదిలో రెండు విడుతల్లో పాఠశాలల ఎస్ఎంసీల ఖాతాల్లో జమ చేస్తున్నది. స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, చిన్నచిన్న మరమ్మతులు, ఇంటర్నెట్ చార్జీలు, కంప్యూటర్లు, ల్యాబ్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, తాగునీరు తదితరాలు కోసం వినియోగిస్తుంటారు. ఎస్ఎంసీ కమిటీలు రద్దు కావడం, వాటి స్థానంలో కొత్త వాటిని ఎన్నుకోకపోవడంతో నిధులు వినియోగించలేని పరిస్థితి నెలకొన్నది. వివిధ గ్రాంట్ల కింద విడుదలైన నిధులు ఎస్ఎంసీల ఖాతాల్లోనే ఉండిపోయాయి. దీనివల్ల పాఠశాలల నిర్వహణ కష్టంగా ఉందని ఉపాధ్యాయులు వాపోతున్న తరుణంలో ప్రభుత్వం చెక్‌పవర్‌లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల హెచ్ఎంతో పాటు సీనియర్ ఉపాధ్యాయుడికి జాయింట్ చెక్‌పవర్ కల్పించింది. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నచోట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంకు జత చేస్తూ చెక్‌పవర్ కల్పించారు. కొత్త ఎస్ఎంసీలు ఏర్పాటయ్యే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. చెక్‌పవర్‌లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు వెలువడడంతో హెచ్ఎంలు బ్యాంకుల్లో తదనుగుణంగా మార్పులు చేసుకుంటున్నారు.

బిల్లుల చెల్లింపునకు అవకాశం

గతేడాది ప్రారంభించిన మన ఊరు-మన బడి, మనబస్తీ - మనబడి కార్యక్రమాల కింద చేపట్టిన పనులన్నీ పాఠశాల విద్యా కమిటీల పర్యవేక్షణలోనే కొనసాగాయి. కమిటీలను రద్దు చేయడంతో చెక్‌పవర్‌కు వెసులుబాటు లేక నిధులు డ్రా చేయలేక పనులు చేసిన వారికి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో ఈ నెలాఖరులోగా పెండింగ్ బిల్లులు లేకుండా చూడాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

ఎస్ఎంసీ చైర్మన్ల తొలగింపు నిర్ణయం హర్షనీయం

ఆడే ప్రకాష్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



ఎస్ఎంసీ ద్వారా నిర్వహిస్తున్న చైర్మన్ వ్యవస్థ తీసి ఉపాధ్యాయులను గౌరవించడం ఎంతో అభినందనియం. ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధికి ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల విషయంలో ఎస్ఎంసీ, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం లేకపోతే చాలా ఇబ్బంది అయ్యేది. తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి తీసుకున్న ఈ నిర్ణయం హర్షనీయమన్నారు.

కార్డెన్ సెర్చ్‌తో నేరాల నియంత్రణ : డీఎస్పీ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని లక్ష్మీపూర్, వెల్గీ గ్రామాలతో పాటు వాంకిడిలో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య నేతృత్వంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత, గ్రామస్తులు మావోయిస్టులకు సహకరించి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో డీఎస్పీతో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ సందర్శించారు. గిరిజన ప్రాంతాల్లో మావోయిస్టులు సంచరించే అవకాశముందని, అపరిచిత వ్యక్తుల మాయమాటలు నమ్మవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సహకరిస్తారని తెలియజేశారు. ప్రజలకు ఏ సమస్యలున్నా పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. యువత మావోయిస్టులకు ఆకర్షితులు కావొద్దన్నారు. అపరిచిత వ్యక్తుల సమాచారం తెలియజేస్తే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని, వందకు డయల్ చేసి తెలియజేయాలని కోరారు. పోలీసులకు వివరాలు అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే ఇటీవల వ్యవసాయ పొలాల్లో పంటలకు రక్షణగా అటవీ జంతువులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చుతున్నారని, ఆ విద్యుత్ తీగలు తగిలి మరణించిన ఘటనలు ఇప్పటికే మండలంలో ఉన్నాయన్నారు. ఎవరు కూడా విద్యుత్ తీగలు అమర్చవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే యువకులు గంజాయి, గుట్కా, మద్యానికి బానిస కాకుండా చదువులు చదివి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎవరైన గంజాయి పండించిన, అమ్మిన వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదివాసి సంస్కృతి సంప్రదాయంతో కామ దహనం





నవతెలంగాణ-జైనూర్

జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలలో ఘనంగా హోలీ పండుగను నిర్వహించారు. అదివారం గిరిజన గ్రామాలలో సంస్కృతి సాంప్రదాయంతో కామ దాహం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న గ్రామ పటేల్, దేవరీ గ్రామస్తులు కలిసి గ్రామ శివారులో వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన యువతి యువకులు, చిన్నారులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని కోదండ రామాలయం దగ్గరలోని ప్రధాన చౌరస్తాలో ఒక రోజు ముందు హోళి పండుగ నిర్వహించే కామ దహనం కార్యక్రమాన్ని మహిళలు నిర్వహించారు. కామ దహనం ప్రక్రియ తర్వాత నేడు హోళి పండుగ జరుపుతామని వారు తెలిపారు.







సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్‌తో కలిసి హాజరై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో ప్రశాంతమైన జీవనం గడపాలన్నారు. తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారని, న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతిరోజు ధ్యానం చేస్తూ సత్ప్రవర్తనతో దైవం పట్ల భక్తి భావం కలిగి ఉండాలని తెలిపారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించాలని సూచించారు. బ్రహ్మకుమారి ఆర్తి ఖైదీలకు రాజయోగ మెడిటేషన్‌పై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీఎం లారీ ఢీకొని విరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లుకు ముడిసరుకు సరఫరా చేసే లారీ ఆదివారం సాయంత్రం కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన సెంట్రల్ లైటింగ్ స్థంభాన్ని ఢీకొంది. దీనితో ఆ స్థంభం పూర్తిగా వంగిపోయింది. సిర్పూరు పేపర్ మిల్లుకు ముడిసరుకు సరఫరా చేసే లారీలు తరచుగా ఓవర్‌లోడ్‌తో వస్తూ సెంట్రల్ లైటింగ్ స్థంభాలను తాకడంతో అవి నేలకు రాలుతున్నాయి. గతంలో దీనిపై ఫిర్యాదులు వచ్చినా యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం ఎస్పీఎం యాజమాన్యానికి, మున్సిపాలిటీకి అడ్డుగోడల విషయంలో వివాదం నెలకొంటుండడం, ఇదే సమయంలో ఎస్పీఎం లారీ ఢీకొని విద్యుత్ స్థంభం నేలకు రాలడంతో ఈ వివాదం మరింత ముదురుతోంది. మున్సిపల్ అధికారుల ఫిర్యాదుతో ప్రస్తుతం లారీని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రెండో రోజుకు చేరిన రిలే దీక్షలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ డిమాండ్ల ఆమోదం కోసం లారీ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వి కిషోర్‌బాబు చేపడుతున్న నిరాహారదీక్ష ఆదివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు దీక్షా శిబిరాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు, సిర్పూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్, సీపీఐ(ఎం) నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు దీక్ష కొనసాగిస్తామని ఈ సందర్భంగా వి కిషోర్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ముందు ప్లాట్‌ఫాంపై వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు ఆదివారం తెల్లవారు జామున గుర్తించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ద్వారా ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కొత్తగూడెంకు చెందిన శంకర్‌గా పోలీసులు నిర్ధారించారు. దీంతో అతని బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. కాగా మృతుడి తల పగిలి రక్తస్రావం అయింది. దీంతో అనుమానస్పద మృతిగా టూ టౌన్ పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. కాగా మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రెగ్యులర్ పోస్టుమెన్ లేక పింఛన్‌కు ఇబ్బందులు



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కిర్డీ గ్రామంలో రెగ్యులర్ పోస్టుమెన్ లేక పింఛన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ పోస్టుమెన్ లేక సంవత్సరాలు గడుస్తున్నాయి. ఇన్‌చార్జిగా ఆసిఫాబాద్ మండలంలోని గుండి గ్రామ పంచాయతీకి సంబంధించిన పోస్టుమేన్‌ను నియమించడంతో పోస్టు ద్వారా వచ్చిన ఏటీఎం కార్డు, లెటర్లు, ఇతర పనులు జరగడం లేదు. అవే కాకుండా ఉపాధిహామీ క్రింద పనిచేస్తున్న కార్మికులకు డబ్బులు కూడా అందడంలేదు. గ్రామంలో సుమారు 200లకు పైగా పింఛన్ దారులున్నారు. వారికి సరైన సమయానికి పింఛన్ అందడంలేదు. ఇప్పటికే ఇన్‌చార్జిగా ఉన్న పోస్టుమేన్ సమయానికి రాకపోవడంతో కిర్డీ, లింబుగూడ, మీంగూడ, ఉపాధిహామీ డబ్బులు, పోస్టు ద్వారా వచ్చే ఏ ఒక్కటి కూడా సకమయానికి అందడంలేదు. వెంటనే రెగ్యులర్ పోస్టుమేన్‌ను నియమించాలని, పింఛన్ దారులతో పాటు గ్రామస్తులు, ఉపాధిహామీ కూలీలు సోమయ్య, రామయ్య, శంకర్, మధూకర్, కోవలక్ష్మి, నాగుబాయి, పోశక్క కోరుతున్నారు.

టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలి

- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచిన పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగ టీచర్ ఎలిజిబెలిటీ టెస్ట్(టెట్), డీఎస్సీ అభ్యర్థులున్నారన్నారు. గతంలో టెట్ పరీక్షలకు సంబంధించి పేపర్-1, 2కి ఫీజు రూ. 200ల చొప్పున రూ.400 మాత్రమే ఉండేదని, కానీ ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఆ ఫీజులను రెండు పేపర్‌లకి కలిపి రూ.1600 భారీగా పెంచిందన్నారు. ఇది టెట్ అభ్యర్థులకు చాలా బాధాకరమైన విషయమని, దీని వలన రాష్ట్రంలోని అభ్యర్థులకు ఆర్థికంగా భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి అభ్యర్థులు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల అభ్యర్థులు ఆర్థికంగా నష్టం జరగకుండా భారీగా పెంచిన టెట్ పరీక్ష ఫీజులను వెంటనే తగ్గించి అభ్యర్థులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో అభ్యర్థులను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జాడి విలాస్, దుర్గం కొటేశ్వర్, శ్యామ్ పాల్గొన్నారు.

'న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నాం'

- సిర్పూరు పేపర్ మిల్లు జనరల్ మేనేజర్ గిరి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

లారీ ఓనర్స్ అసోషియేషన్ న్యాయపరంగా చేసే డిమాండ్ల పరిష్కారానికి సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్యం సానుకూలంగా ఉందని మిల్లు జనరల్ మేనేజర్ గిరి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్పీఎం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సెప్టెంబర్‌లో లారీ అసోషియేషన్‌కు, మిల్లు యాజమాన్యానికి ఒప్పందం జరిగిందని, ఇపుడు మళ్లీ డిమాండ్ల పేరిట లారీ అసోషియేషన్ సభ్యులు సమ్మె చేపడుతున్నారని అన్నారు. ప్రస్తుతం 12 నుండి 14 డిమాండ్లలో ఒకట్రెండు మినహా అన్ని డిమాండ్లు పరిష్కారమయ్యాయని తెలిపారు. మిగిలిన డిమాండ్ల విషయంలో కూడా కలెక్టర్, ఆర్డీఓ, డీఎస్పీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగాయని, తాము న్యాయపర డిమాండ్ల ఆమోదం విషయంలో ఇప్పటికీ సానుకూలంగానే ఉన్నామని అన్నారు. ఏమైనా సమస్యలు ఏర్పడితే ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని పరిష్కారం చేసుకోవాలని గత సెప్టెంబర్‌లో జరిగిన ఒప్పందంలో లారీ అసోషియేషన్ అంగీకరించిందని తెలిపారు. ఇప్పుడు తాము దానికి కట్టుబడి ఉన్నట్లు వివరించారు. ఇదే విషయాన్ని తాము జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకుపోయినట్లు తెలిపారు. పేపర్ రవాణా ఛార్జీల చెల్లింపు విషయంలో తమకు సమీపంలో ఉన్న మూడు పేపర్ మిల్లులతో పోల్చితే ఇప్పటికే తాము అధికంగా చెల్లిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం జేకే యాజమాన్యం మిల్లును తీసుకున్న తర్వాత దేశంలోనే టాప్-10 కాగితాన్ని ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. దీనికి కార్మికులు, అధికారుల కృషి ఉందని అన్నారు. మిల్లు అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమం, స్థానిక ప్రజలకు తమ వంతు సేవ అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీఎం రహదారులపై నిర్మించిన అడ్డుగోడల కూల్చివేత విషయమై విలేకరులు ఆయనను ప్రశ్నించగా ఇది కోర్టు పరిధిలో ఉన్నందున దీనిపై ఇపుడు ఏమీ మాట్లాడలేమని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ మేనేజర్ రమేష్‌రావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

నవతెలంగాణ-జన్నారం



పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి ముఖ్య ప్రాంతాలలో బహిరంగంగా చెత్త వేస్తే జరిమానా విధిస్తామని పోన్కల్ మేజర్ గ్రామ పంచాయితీ ఈఓ రాహుల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కవ్వాల్, బస్టాండ్ తాసిల్ చౌరస్తా అంగడి బజార్, స్టేట్ బ్యాంక్ ఏరియా, ధర్మారం చౌరస్తా, తదితర ముఖ్య రహదారుల వద్ద ప్రజలు చెత్త వేయకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. బహిరంగంగా చెత్తవేస్తే పరిసర ప్రాంతాలు అపరిశుభ్రమయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. చెత్త వేసే వారికి రూ.1000 జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. చెత్తను పంచాయతీ ఏర్పాటు చేసిన నిర్దిష్ట స్థలాల్లోనే వేయాలన్నారు. జన్నారం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

నేడు కైతల ఎన్నిల కార్యక్రమం

నవతెలంగాణ-నస్పూర్

కైతల ఎన్నిల పున్నమి పూట సోమవారం కవుల కలయిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రచయిత వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోకల రాజేశం, ముత్యం నాగవర్మలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తెలంగాణ రచయితల వేదిక మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడి కరోనాకాలంలో నిలిచిపోయిందని, తిరిగి మరల ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ శివాజీ చౌక్ దగ్గర గల తోకల రాజేశం ఇంటి వద్ద సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభించబడుతుందన్నారు. సకాలంలో కవులు, రచయితలు హాజరు కావాలని కోరారు. గతంలో ఈ కార్యక్రమం నిర్వహించేవారని, గత కొంత కాలంగా నిలిపివేశారని నూతనంగా పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చక్రవర్తుల శ్రీమాన్ రాసిన 'కారున్' కథా సంపుటి పరిచయం ఉంటుందని, అనంతరం కవి సమ్మేళనం కొనసాగుతుందని సమయానికి అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జీపీ కార్మికులకు తప్పని పని 'భారం'

- మల్టిపర్‌పస్ పేరుతో శ్రమదోపిడి
- పాఠశాల పరిశుభ్రత బాధ్యతులు
- అదనపు పనులతో సతమతం
- సెలవులు లేక వేదిస్తున్న ఆరోగ్య సమస్యలు

నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ కార్మికుల అదనపు పని భారం మోపుతూ శ్రమ దోపిడికి గురిచేస్తున్నారని పలు పంచాయతీ కార్మికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పొద్దుపోయే వరకు గ్రామ పంచాయతి పరిధిలో ఏదో ఒక పని ఉండే వుంటుంది. పారిశుధ్య పనులతో పాటు పాఠశాల తరగతి గదులు, మూత్ర శాలు శుభ్రపర్చడం రోజువారి విధుల్లో భాగమైందని కార్మికులు పేర్కొంటున్నారు. జైపూర్ మండల పరిధిలో గల 20 గ్రామ పంచాయతీల్లో 76 మంది పంచాయతి కార్మికులు పని చేస్తున్నారు. భీమారం మండల పరిధిలో గల 11 గ్రామ పంచాయతీలలో 33 మంది పంచాయతీ కార్మికులు పని చేస్తున్నారు. మల్టీపర్పస్ కార్మికులుగా నియమితులైన వీరు పంచాయతి కార్యదర్శి మొదలు జిల్లా కలెక్టర్, అధికారులు ఎవ్వరు వచ్చినా హాజరుగా ఉండాలి. రోడ్లు ఊడ్చి, మురికి కాలువలు శుభ్రం చేసి, ఇల్లిల్లు తిరుగుతూ చెత్తను సేకరించి డంపు యార్డుకు తరలించాలి. డంపు యార్డులో తడి పొడి చెత్తను వేరు చేయాలి. చివరికి స్మశాన వాటిక పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు పరిశుభ్రపర్చడం రోజువారి విధుల్లో భాగమే. అదేవిధంగా గ్రామ పంచాయతీల పరిధిలో కుక్క చచ్చినా.. నక్క చచ్చినా వెంటనే స్పందించాలి. కాదు కూడదు అనకుండా గ్రామ పంచాయతి పరిధిలో ప్రతి పని తమదిగా భావించి మల్టీపర్పస్ వర్కర్లుగా నియమితులైన కార్మికుల పని భారం తగ్గించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్వీపర్లను ఏర్పాటు చేయకుండా పాఠశాల పనుల నిర్వాహణ పంచాయతి కార్మికులకు అప్పగించడం బాధాకరం. మల్టీపరపస్ కార్మికలును నియమించిన వెంటనే అప్పటి వరకు పాఠశాల పార్టైమ్ వర్కర్లును తొలగించారు. వారి స్థానంలో మల్టీపరపస్ కార్మికులను వినియోగిస్తున్నారు. ఈ విధంగా పంచాయతి పనులతో పాటు అదనపు పని భారంతో శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురవుతున్న మల్టీపర్పస్ కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



శివ్వారంలో పారిశుద్ధ్యపు పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

జనభా ప్రాతిపదికన నియామకం

2011 జనాభా లెక్కల ప్రాతిపధికన గ్రామ పంచాయతీ కార్మికుల నియామకం చేపట్టారు.. 500 మంది జనాభాకు ఒకరి చొప్పున ప్రతి గ్రామ పంచాయతీల పరిధిలో నియమించిగా పెరుగుతున్న జనాభాకు అదనంగా సేవలు అందించాల్సి వస్తోంది. నెల వారి జీతం రూ. 9,500 చొప్పున నియమితులైన పంచాయతీ కార్మికులకు జీతభత్యాల చెల్లింపుల్లో కూడా జాప్యం జరుగుతుండటం వారిని ఆవేధనకు గురి చేస్తోంది. 13 సంవత్సరాల క్రితం ఉన్న జనాభా ఆధారంగా నియమించిన అధికారులు పెరిగిన జనాభాను గుర్తించకుండా పంచాయతి కార్మికులతో శ్రమదోపిడి చేస్తున్నారనే విమ్మర్శలు లేకపోలేదు. గ్రామ పంచాయతి పరిధిలో ప్రతి పని తానై చేస్తున్న కార్మికుల జీత భత్యాలు పెంచడంతో పాటు ఏటకేటా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అదనపు కార్మికులను నియమించాల్సిన బాధ్యతను అధికారులుగుర్తించాలి.



పాఠశాల పనుల నిర్వాహణలో కార్మికులు (ఫైల్)



చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నాము

ఆరెపల్లి శంకరయ్య (గ్రామ పంచాయతి కార్మికుడు భీమారం)

గ్రామ పంచాయతి కార్మికునిగా నియమించినప్పుడు నెల వారి జీతం రూ. 6 వేలు ఉండేది. ఆ తదుపరి రూ.8 వేలకు పెంచడం జరిగింది. గత మే నెల నుండి రూ.9,500 చొప్పున చెల్లిస్తున్నారు. రోజుకు రూ. 306లతో రోజులో 12 గంటలు పని చేస్తున్నాము. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్న పంచాయతీ కార్మికల జీతాలు పెంచాలి. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలో కుటుంబాలను నెట్టుకు రావడం ఇబ్బందిగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతి కార్మికుల పట్ల దృష్టి సారించాలని ఆశిస్తున్నాము.

గైర్హాజరయితే.. జీతంలో కోత

చెన్నూరి విశ్వనాథం గ్రామ పంచాయతి కార్మికుడు భీమారం



కడుపు నొచ్చినా.. కాలు నొచ్చినా రోజు వారి విధుల్లో పాల్గొనాల్సిందే. తప్పనిసరై విధులకు దూరంగా ఉంటే వేతనంలో కోత తప్పడం లేదు. నెల రోజుల డ్యూటీకి అదనంగా రెండు మస్టర్లు ఇస్తున్నారు. అదనంగా ఇస్తున్న ఈ రెండు మస్టర్లు సరిపోకుండా గైర్హాజరైన సంధర్భంలో జీతంలో కోత విదిస్తున్నారు.. అనారోగ్యానికి గురై నాలుగైదు రోజులు డ్యూటీకి రాకుంటే అదనంగా ఇస్తున్న రెండు మస్టర్లు పోను మిగితా రెండు మస్టర్ల జీతం కట్ చేస్తున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్



నవతెలంగాణ-మందమర్రి

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ అన్నారు. ఆదివారం సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కేంద్ర బలగాలతో పోలీస్ స్టేషన్ నుంచి 3వ జోన్, 2జోన్ మస్జిద్, మార్కెట్, సింగరేణి పాఠశాల మైదానం, పోస్ట్ ఆఫీస్ గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవి కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనలకు తావు లేకుండా పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలందరికీ ఎన్నికల పట్ల భద్రత, భరోసా కల్పించడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎవరైనా అల్లర్లు సృష్టించాలని చూస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్ట్ దగ్గర, డివిజన్ పరిధిలో ఆకస్మికంగా వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, మందమర్రి ఎస్ఐ ఎస్ రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జి.రాజశేఖర్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



నవతెలంగాణ-మందమర్రి

మట్టల ఆదివారం పండుగని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మట్టల ఆదివారం పండుగను పురస్కరించుకొని పట్టణంలోని క్రైస్తవులంతా సీఐఎస్ చర్చికి తరలిరావడంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు మట్టలతో భక్తి గీతాలు ఆలపిస్తూ చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చి ప్రేస్బిటర్ రెవ జెర్మీయా ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవ జెర్మీయా మాట్లాడుతూ యేసు ప్రభువు జేరుసలేం పట్టణంలో ప్రప్రథమంగా ప్రవేశించినపుడు అక్కడి ప్రజలు యేసు ప్రభువును గాడిదపై తీసుకుని వస్తూ పెద్దఎత్తున వివిధ రకాల మట్టలతో ఘన స్వాగతం పలికారని, దీనినే క్రైస్తవులు మట్టల పండుగగా ఆచరిస్తారని తెలిపారు. ఈ పండగను గుడ్ ఫ్రైడేకు ముందు వచ్చే ఆదివారం జరుపుకొంటారు. ఈ వారాన్ని పరిశుద్ధ వారంగా పరిగణిస్తారు. అంతకు ముందు సండే స్కూల్‌కు చెందిన చిన్నారులు వివిధ రూపాల్లో యేసుక్రిస్తు పుట్టు పూర్వోత్తరాలు తెలిపేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రమాదపు అంచున నిర్మాణం పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-నస్పూర్



ప్రమాదపు అంచున నిర్మాణాలు చేపడుతున్నా కూడా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని కొత్త రోడ్డు సమీపంలో జాతీయ రహదారి 363ని ఆనుకొని విద్యుత్ స్తంభాన్ని సైతం గోడ లోపల నిర్మించుకొని నిర్మాణాన్ని చేపట్టిన కూడా విద్యుత్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నాయి. జాతీయ రహదారి 363 కోసం కొంత భూమిని అధికారులు స్వాధీనం చేసుకొని భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని సైతం చెల్లించారు. ఇదిలా ఉండగా ఖాళీగా ఉన్న స్థలంలో వారికి సంబంధించిన భూమి ఉందంటూ అధికారుల అనుమతులు లేకుండానే పలువురు నిర్మాణాలు చేపడుతున్నారు. విద్యుత్ స్తంభాన్ని గోడ లోపల నిర్మించుకోవడం వర్షాకాలంలో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు అధికారులు మరమ్మత్తులు ఎలా చేపడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొత్తగా నిర్మించుకునే వారిపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పెద్దపెల్లి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

నవతెలంగాణ-కాసిపేట

పెద్దపెల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను బారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ బన్న లక్ష్మణ్ దాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాకా కుటుంబం కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు ఎన్నో సేవ కార్యక్రమాలు చేసిందని అన్నారు. కార్మికులకు పదవి విరమణ అనంతరం పెన్షన్ విధానాన్ని అమలు చేసి నేడు వారి జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. రైతులకు అందుబాటులో ఎరువుల పరిశ్రమలను తిరిగి ప్రారంభించేలా కృషి చేశారని, విద్య, వైద్య, సేవ కార్యక్రమాలలో వారి సహకారం మరువలేనిది, విశాఖ ట్రస్టు ద్వారా పాఠశాలలకు మౌలిక వసతులు, భవనాల నిర్మాణం, పుస్తకాలు, బెంచీ లను అందచేసి విద్య వ్యాప్తికి ఎనలేని కృషి చేశారని, మంచి నీటి సమస్యలను నిర్మూలించేందుకు బోరు బావులను, ట్రక్కరను ద్వారా అందించారని గుర్తు చేశారు.

అంబేద్కర్ సంఘం మండల కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ వద్ద అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కోర్ కమిటీ ఇన్‌చార్జి బన్న లక్ష్మణ్ దాస్, కోర్ కమిటీ సభ్యులు, సలహాదారులు దాగం మల్లేష్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా జాడిపోశం, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దాసరి రాజయ్య, ఉపాధ్యక్షులుగా గోదార్ల శంకర్, గొడిసెల సురేందర్, దుర్గం రాంచందర్, ప్రధాన కార్యదర్శిగా రామిల్ల కిష్టయ్య, సహాయ కార్యదర్శిగా అగ్గి స్వామి, ప్రచారం కార్యదర్శిగా దుర్గం సుధాకర్, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి కొమ్ముల బాపు, మైనారిటీ సెల్ ఇన్‌చార్జి ముస్తఫా, బీసీ సెల్ ఇన్‌చార్జిగా పెద్దపెల్లి శంకర్, సాంస్కృతిక కమిటీ ఇన్‌చార్జి గోడిసెల బాపు, మండల కమిటీ సలహాదారులుగా దాగం మల్లేష్, పల్లె మల్లయ్య, వాసుదేవ్, నర్సింగం, సిద్ధం తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, జంజీరాల తిరుపతి, శిలోజు మురళి, మద్దినేని చిన్న భీమయ్య లంక లక్ష్మణ్, రత్నం ప్రదీప్, బోయిని తిరుపతి, వేముల కృష్ణ, అక్కిపెల్లి లక్ష్మీ, బుగ్గయ్యలు ఏకగ్రీవంగా ఎన్నియయ్యారని ప్రకటించారు.

ఘనంగా వైభవ్ జ్యువెలర్స్ ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

వైభవ్ జ్యువెలర్స్ బ్రాంచ్‌ను మంచిర్యాలలో డాక్టర్ విష్ణువర్ధన్ రావు, వైభవ్ సంస్థల సీఎండీ భారత మల్లికా రత్నకుమారితో కలిసి ప్రారంభించారు. కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు తొగరు సుధాకర్, వెంకటేశ్వర షాపింగ్ మాల్ ఎండీ నల్లా వెంకటనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోస్తా ఆంధ్ర, తెలంగాణలో సుపరిచితమై అద్భుతమైన మంచి డిజైన్స్, ధరతో 916 హల్ మార్క్డ్ 22 క్యారెట్ల బంగారం ధరలో ఆభరణాలను ఇప్పుడు మంచిర్యాల పరిసర ప్రాంత వినియోగదారులకు అందించటం శుభపరిణామం అని, అభినందించదగ్గ విషయమని అన్నారు. 925 స్వచ్ఛత కలిగి 100శాతం తిరిగి కొనుగోలు హామీ గల స్టెర్లింగ్ సిల్వర్ వస్తువులను, సాధారణ వెండి వస్తువులు, జ్యువెలరీ అందించాలని ఉద్దేశంతో 15వ వైభవ్ జ్యువెలరీ షోరూంను మంచిర్యాలలో స్థాపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

అప్పారి వెంకటస్వామి ఆశయాలను సాధిద్దాం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు



నవతెలంగాణ-హాజీపూర్

టీఎస్‌యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతిని మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానకార్యదర్శి గుర్రాల రాజావేణు మాట్లాడుతూ అప్పారి 18 సంవత్సరాల సర్వీస్‌ను త్యాగం చేసి జీవితాంతం ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితం చేశారన్నారు. సమయపాలనలో ఆర్థిక క్రమశిక్షణలో, మిలిటెంట్ పోరాటంలో వారు నేటి తరానికి ఆదర్శప్రాయులు అని అన్నారు. రీగ్రూప్ స్కేల్స్ సాధనలో, ఉపాధ్యాయులకు సెలవులు సాధించడంలో, ప్రతి ఫలితంలో అప్పారి కనిపిస్తారన్నారు. ఉపాధ్యాయుల ఉద్యమంను, సంఘంను బలోపేతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరం పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బి.కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు భారీక్ రావు, వాహిద్ అలీ, రాములు, శంకరయ్య, లక్ష్మణ్‌రావు, అశోక్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకుల ఆగడాలను అరికట్టాలి

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకుల ఆగడాలను అరికట్టాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుర్తింపు సంఘంగా గెలిచి ధ్రువపత్రాన్ని కూడా పొందకుండా ఏఐటీయూసీ నాయకులు, అలాగే ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీ నాయకులు ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని ఆరోపించారు. కార్మికుల డిప్యూటేషన్లు, ట్రాన్స్‌ఫర్లకు విచ్చలవిడిగా లంచాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. మహిళలని కూడా చూడకుండా అనేక రకాలైన ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కొంతమంది యూనియన్ల పేరుతో ఉచిత మస్టర్లు పడుతూ సింగరేణికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. మహిళలకు 33 శాతాన్ని రిజర్వేషన్ అమలుపరుస్తూ, ప్రతి డిపార్మెంట్లలో ఆరుగురు మహిళలకు మహిళా సూపర్‌వైజర్‌ని ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఆర్పీఓసి ఈపి ఆపరేటర్లు మణుగూరులో ఐదు సంవత్సరాలు చేయాలని నిబంధనను తొలగించాలన్నారు. విజిలెన్స్ అధికారులుగా ఐపీఎస్ అధికారులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు తిప్పారపు సారయ్య, అనిల్ రెడ్డి, జీవన్ జోయల్ పాల్గొన్నారు.

ఆదివాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంద్ర భూమయ్య మాట్లాడుతూ అన్యాక్రాంతమైన భూములను తిరిగి ఆదివాసీలకు అప్పగించాలని, అడవిపై పూర్తి హక్కు ఆదివాసీలుకే ఉండాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు పూర్తి స్థాయిలో ఆదివాసీలకే కల్పించాలని, పట్టా హక్కు కల్పించాలని, 1935లో బ్రిటీష్ ప్రభుత్వం ఆదివాసీలకు భూమి సెటిల్మెంట్ చేసిన పట్టాలను ఆదివాసీలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, ఉపాధ్యక్షులు ఆత్రం మహేశ్, గెడం సీతారాం, నాయకులు టేకం భగవంత్‌రావు, మడావి తిరుపతి పాల్గొన్నారు.

